క్లుప్తంగా

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, కుమ్మరిగేరి, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాల్లో జరుగుతున్న పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు దాహార్తి సమస్యలు రాన్వికుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఏ వార్డులో, ఏ ప్రాంతంలో నీటి సమస్య వచ్చినా వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదులు చేయాలన్నారు.

గిరిజనులకు ఉచిత వైద్య పరీక్షలు

కొత్తపల్లి: మండలంలోని జానాలగూడెం, బలపాల తిప్ప గూడేలలో సంఘమిత్ర సేవాసమితి ఆధ్వర్యంలో ఐఎంఎ మహిళ వైద్యుల తోడ్పాటుతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వృద్ధులకు కంటి శుక్లం ఆపరేషన్లకు, 2 సంవత్సరాలు చిన్నారికి హెర్నియా శస్త్ర చికిత్సలు చేయవలసిన అవసరాన్ని గుర్తించారు. వారికి నంద్యాలలో సంబంధిత వైద్యులను సంప్రదించి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేస్తామని వైద్యులు తెలిపారు. వీరితో పాటు ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎం.నర్మదా, హరిత, స్ఫూర్తి రెడ్డి, వకుల్ల క్రాంతి, భాగ్యలక్ష్మి, కాదర్ బాద్ ఉదయ శంకర్, కాదర్ బాద్ సత్య శివ సుందరి పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

మహానంది: బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వెంగళరెడ్డిపేట గ్రామంలో బాలక్క ఇంటి సమీపంలో టెంకాయ చెట్టుపై పిడుగు పడటంతో పొగలు చేలరేగాయి.

పాములపాడులో 6.8 మి.జ్లీ మీ

పాములపాడు: మండలంలో శనివారం కురిసిన వర్షం 6.8 మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. మరో వర్షం కురిస్తే దుక్కులు చేసుకునే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

జూపాడుబంగ్లాలో 24.6 మిల్లీ మీటర్లు

జూపాడుబంగ్లా: శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 24.6మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు ఆదివారం తెలిపారు.

జనం లేక బోసిపోయిన ఏపీ న్యాయ్ యాత్ర



జనం లేక బోసిపోయిన ఏపీ న్యాయ్ యాత్ర

నందికొట్కూరు: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఏపీ న్యాయ్ యాత్ర జనం లేక బోసిపోయింది. పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. వైఎస్సార్‌ను నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలు మరిచిపోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మహానంది: బొల్లవరం గ్రామంలో ఆదివారం బెల్టుషాపుల నిర్వాహకులపై దాడులు చేసి గ్రామానికి చెందిన పెనుగొండ శ్రీనివాసుల వద్ద 40 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

శ్రీశైలంప్రాజెక్ట్: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలలో ప్రవేశానికి ఆదివారం పరీక్షలు జరిగాయి. సున్నిపెంటలోని గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. 5, 6, 7, 8, 9వ తరగతులలో ప్రవేశానికి 183 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 58 మంది హాజరయ్యారు.

వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తనిష్క



మహానంది: బండిఆత్మకూరు ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న గీతావాణి కుమార్తె తనిష్క ఒకటి నుంచి వంద వరకు 31 సెకన్లు 84 మిల్లీ సెకన్లలో లెక్కించి ప్రపంచ వ్యాప్త బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకుంది. ఈ మేరకు ఆదివారం వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. హైదరాబాద్‌లో మార్చి 18న ఫాస్టెస్ట్ కౌంట్ 1 టూ 100 టీనేజర్ కార్యక్రమం నిర్వహించారు. తనిష్క ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎల్ఎల్‌బీ చదువుతుందని స్థానికులు తెలిపారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

- ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిన ఏకైక సీఎం జగన్
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- మహిషాసురమర్ధినికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారానికి శ్రీకారం
- ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన





సున్నిపెంట ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న శిల్పా చక్రపాణిరెడ్డి, చిత్రంలో బుడ్డా శేషారెడ్డి, శ్రీశైలంలో అశేష జనవాహిని మధ్య ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శిల్పా

శ్రీశైలంటెంపుల్: ప్రజలను మోసపూరిత వాగ్దానాలతో నమ్మించి, ఎన్నికల్లో గెలవడమే చంద్రబాబు నైజమని, ఆయనను నమ్మొద్దని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీశైలంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ముందుగా మహిషాసురమర్ధిని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, టెంకాయలు కొట్టి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే శిల్పాతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి, శిల్పా తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారి ఆలయం నుంచి శ్రీగిరి కాలనీ, కొత్తపేట, ఎస్సీకాలనీ, ఎస్టీ కాలనీ, వడ్డేర కాలనీ తదితర ఏరియాలలో ఎమ్మెల్యే శిల్పా వాహనంపై ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అడుగడుగునా గుమ్మడికాయలు కొట్టి, హారతులు పట్టారు. అలాగే పలువురు నాయకులు, కార్యకర్తలు గజమాలతో అపూర్వ సాగత్వాన్ని పలికారు. అలాగే పలువురు లంబాడీ మహిళలు, యువత, మహిళలు నృత్యాలు చేస్తూ శిల్పాకు తమ మద్దతు పలికారు.

ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు

2011లో శ్రీశైలం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు తనకు ప్రజల్లో ఆదరణ తగ్గలేదని, ఇందుకు ఎమ్మెల్యే శిల్పా ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుడ్డా శేషారెడ్డి తనతో ప్రయాణం చేయడం పట్ల కూడా ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఎన్నో అమలుకానీ హామీలను ప్రజలకు ఇచ్చారని అయితే అధికారం చేపట్టాక ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు.

శ్రీశైలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశా

శ్రీశైల మండలాన్ని, శ్రీశైలాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసింది తానేనని ఎమ్మెల్యే అన్నారు. శ్రీశైలంలో ప్రతి కాలనీకి సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేశానని తెలిపారు. 40 సంవత్సరాలుగా కాని పనిని గెలిచిన వెంటనే కేవలం మూడు నెలల్లో సున్నిపెంటను గ్రామపంచాయతీగా చేశానని గుర్తు చేశారు. మండలంలో నాలుగు సచివాలయాలను ఏర్పాటు చేయించి 162 మంది వలంటీర్లకు ఉపాధి చూపానన్నారు. పెద్దసత్రం తొలగిస్తే వారికి శ్రీశైలంలోనే ఇంటి స్థలం ఇప్పిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచాక నెలకే శ్రీశైలంలో విద్యుత్ మీటర్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. లలితాబజార్‌లో నష్టపోయిన వ్యాపారులకు తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

కార్తీక్ అని పేరు పెట్టుకుంటే.. కార్తికేయ ఏజెన్సీ నాది అవుతుందా?

శ్రీశైలంలో ఏజెన్సీ నిర్వహిస్తున్న కార్తికేయ ఏజెన్సీకి మాకు ఎటువంటి సంబంధం లేదని, కార్తీక్ అని పేరు ఉంటే కార్తికేయ ఏజెన్సీ నాది అవుతుందా అని ప్రతిపక్ష నాయకులను శిల్పా కార్తిక్‌రెడ్డి ప్రశ్నించారు. కనీస పరిజ్ఞానం లేకుండా విమర్శలు చేయడం, మాట్లాడడం మంచిది కాదని హితవు పలికారు. 2008సంవత్సరం నుంచి కార్తికేయ ఏజెన్సీ శ్రీశైలంలో ఏజెన్సీ నడుపుతుందని గుర్తుచేశారు. ప్రజల్లో ఆదరణ లేక, ఎన్నికల్లో గెలవలేక ప్రతిపక్ష నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని సీఎం జగన్ నినాదమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, పాపారావు, కృష్ణారెడ్డి, నవమ్మ, కోటమ్మ, ప్రభావతి, అనిల్‌కుమార్‌రెడ్డి, కుమార్, విష్ణు, మార్కెట్ యూత్, వెష్టన్‌కాలనీ యూత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్

ప్రపంచంలో ఏ సీఎం చేయని విధంగా రాష్ట్రంలో సుపరిపాలన అందించడంతో పాటు, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం జగన్ ఒక్కరేనని బుడ్డా శేషారెడ్డి తెలిపారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన ఒకే ఒక వ్యక్తి వైఎస్ జగన్ అని అన్నారు. అసలు చంద్రబాబు చెబుతున్న సూపర్ సిక్స్ పథకాలు ఏంటివో ఎవరికీ అర్థం కావడం లేదని విమర్శించారు. సీఎం జగన్‌ని, నియోజకవర్గ ఎమ్మెల్యేలను తిట్టడం తప్ప ప్రతిపక్ష నాయకులుకు ఏమీ పని లేదన్నారు. సంక్షేమం అందిస్తున్న జగన్ కావాలా, లేక మోసం చేసే చంద్రబాబు కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని అన్నారు.

దురుద్దేశంతోనే కూటమి ఏర్పాటు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆంధ్ర రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కాకుండా కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకుండా చేయాలనే దురుద్దేశంతో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కుట్రపూరితంగా జతకట్టాయని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంటలో ఎన్నికల ప్రచారంలో శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మళ్లీ 'ఫ్యాను' గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే మూడునెల్లోనే ఎవరు నివశిస్తున్న గృహాలు వారికే శాశ్వత హక్కు కల్పించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని శిల్పా హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయిస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి తనపై బురద చల్లడానికే ఉన్నాడని, నేను అవినీతి పరుడిని అని బుడ్డాకు నిరూపించే దమ్ముందా అని సవాల్ విసిరారు. బుడ్డా శేషారెడ్డి మాట్లాడుతూ తన సోదరుడు బుడ్డా రాజశేఖరరెడ్డి వైఎస్సార్‌సీపీలో గెలిచి, పార్టీ ఫిరాయించాడమన్నారు. ఐదేళ్ల కాలంలో శ్రీశైలం మండలంలో ఎటువంటి అభివృద్ధి పనులు పూర్తి చేయలేదన్నారు. కార్యక్రమంలో యువనేత శిల్పా కార్తీక్‌రెడ్డి, కరాటే మాస్టర్ శోభన్ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందాం



శాతనకోటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్

- ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్
- సంక్షేమం కావాలంటే జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి
- శాతనకోట, జంగంపాడులో ఇంటింటి ప్రచారం

నందికొట్కూరు రూరల్ : సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఎన్నుకోవాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని శాతనకోట, జంగంపాడు గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసేలేదని, అభివృద్ధి ఆటకెక్కిందన్నారు. జగనన్న తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నకు సీఎంగా అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షుకూర్ మియ్య, సర్పంచ్ జనార్ధన్‌గౌడు, మండలాధ్యక్షుడు రవియాదవ్, గ్రామ నాయకులు శాతనకోట మధుయాదవ్, సంజన్న ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.


శిల్పాను మరోమారు ఆశీర్వదించండి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెలుగోడు: పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డిని ఆశీర్వదించాలని కోరుతూ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే సమీప బంధువులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక జమ్మినగర్‌లో ఎమ్మెల్యే సమీప బంధువులు సతీష్, అనురాగ్, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, మండల ఇన్‌చార్జ్ గుర్రెడ్డి రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే బంధువుల సతీష్, అనురాగ్, గుర్రెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నకు అందరూ మళ్లీ అండగా నిలవాలని కోరారు. ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డిని, నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కే.రామ్మోహన్ రెడ్డి, నాయకులు షంషీర్ అలీ, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలను తిప్పికొట్టాలి



బుక్కాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మహానంది: కూటమి కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే పేదలకు వస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. తమ్మడపల్లెలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహానంది మండల పోలింగ్ బూత్ కమిటీల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు, నాయకులు కందుల రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో బుక్కాపురంలో ఎన్నికల ప్రచారం కొనసాగించారు. గాజులపల్లెలో రెండో రోజు వైఎస్సార్‌సీపీ నాయకులు గాజులపల్లె కిట్టు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. సీనియర్ నేత కొండా మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు ఇంటింటికి తిరిగి సీఎం జగన్ చేసిన సంక్షేమ పథకాలను వివరించి, ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గోపవరం గ్రామంలో సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, నాయకులు పుల్లయ్యయాదవ్, ఏవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు.

బండిఆత్మకూరు మండలంలో..

బండిఆత్మకూరు మండలంలోని ఈర్నపాడులో సీనియర్ నాయకులు పిట్టం పెద్దరామసుబ్బారెడ్డి, ఎంపీటీసీ యర్రం గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెమళ్లకుంటలో బలరామిరెడ్డి, వెంటరామిరెడ్డి, బి.కోడూరు గ్రామంలో శివారెడ్డి, మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గెలుపు కోసం జోరుగా ప్రచారం సాగించారు.

ఓంకారంలో పెళ్లిళ్ల సందడి



ఆలయం వద్ద వివాహం చేసుకుంటున్న వధూవరులు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో ఆదివారం పెళ్లిళ్ల సందడి నెలకొంది. వధూవరులు స్వామివారి సన్నిధిలో వివాహం చేసుకున్నారు. అలాగే సెలవురోజు అవడంతో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు.

మహానందిలో సండే సందడి

సెలవురోజు కావడంతో ఆదివారం మహానంది ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు పూజలు చేపట్టారు. స్వామి సన్నిధిలో వైఎస్సార్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజేష్ కుమార్ మీనా ఐఆర్ఎస్ ఆదివారం పూజలు నిర్వహించారు. ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు, డీటీ సత్యశ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజులు స్వాగతం పలికారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు ఐక్యంగా కృషి చేద్దాం

- ఈనెల 24న దారా సుధీర్ నామినేషన్‌కు భారీగా తరలిరావాలి
- గ్రామాల వారీగా కార్యకర్తలతో చర్చించిన ఏపీ శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన పి.లింగాపురం వాసులతో శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మరోమారు జగనన్నను సీఎంగా చేసుకోవడంతో పాటు దారాసుధీర్ గెలుపునకు ఐక్యమత్యంతో కృషి చేయాలని ఏపీ శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన జూపాడుబంగ్లాలో రమేష్‌రెడ్డి ఇంటివద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడిన ఆయన ఈనెల 24న నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రతి మండలం నుంచి 5వేల మంది చొప్పున నియోజకవర్గం వ్యాప్తంగా 30 వేల మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న టీడీపీ నాయకులు

మండలంలోని పి.లింగాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గ్రామ సర్పంచ్, జేసీఎస్ మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన గుండెపోగు పెద్దతిరుపాలు, బాలపుల్లయ్య, శ్రీరాములుతో పాటు 20 మంది కుటుంబ సభ్యులు, రాజేష్, బిడుగుసాయి, రమేష్, చంద్రకాంత్, కాటిపోగుశివ, స్వాములు, ఏసురత్నం, సతీష్, శాబోలునాగన్న, చంద్రపాల్, సంజన్న, గుండెపోగుసూరి, తప్పెటమధు, మహేష్‌లకు సిద్ధార్థరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, సర్పంచులు పీఎం నాగిరెడ్డి, ప్రకాశం, నరేష్‌కుమార్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ వెంకటరమణ, గుండ్రెడ్డి భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, హరికృష్ణ, గోవింద్‌యాదవ్, విజయ్ కుమార్, నరసింహయాదవ్, రాముడు, జంగాలసుంకన్న, సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, మందడి సతీష్‌రెడ్డి, బాలస్వామి, కృష్ణారెడ్డి, ఈదుల నారాయణరెడ్డి, దేవసహాయం, పోచా శివారెడ్డి, దొడ్డాసుధాకర్, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేద్దాం

పాములపాడు: ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేద్దామని రాష్ట్ర శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును తెలియజేయాలన్నారు. ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు అందాయని తెలిపారు. టీడీపీ మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అని, కేవలం హామీలివ్వడం తప్పా ఆచరణలో చంద్రబాబునాయుడు ఎల్లప్పుడు విఫలమేనని గుర్తు చేశారు. టీడీపీకి బుద్ధి చెప్పి, ఫ్యాన్ ప్రభంజనాన్ని సృష్టించేందుకు ప్రజలంతా సిద్ధగా ఉన్నారని తెలిపారు. అనంతరం దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు విజయసింహారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు, పార్టీ మండల కార్యదర్శి మధుసూదన్‌రావు, సొసైటీ ఛైర్మన్ చౌడయ్య, మాజీఛైర్మన్ రమణారెడ్డి, సర్పంచులు రామస్వామి, వరప్రసాద్, కోట్ల చంద్రారెడ్డి, మౌలాలి, ఎంపీటీసీలు బషీరాహ్మద్, సురేష్, నాయకులు కోట్ల నాగేశ్వరరెడ్డి, గోపాల్, గని, యుగంధర్‌రెడ్డి, మహానందిరెడ్డి, జబ్బార్, ప్రతాపరెడ్డి, చలమారెడ్డి, నరసింహగౌడు, బాలునాయక్, బాలీశ్వరరెడ్డి, శేషులు, మాలిక్, లక్ష్మణగౌడు, ఉశేన్‌బాషు, ప్రభాకర్, అంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇరవై రోజులు కష్టపడదాం..

పగిడ్యాల: రాబోయే ఇరవై రోజులు కష్టపడి మళ్లీ జగనన్న రాజ్యాన్ని తెచ్చుకుందామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గ్రామ నాయకులకు పిలుపునిచ్చారు. ఆదివారం పగిడ్యాలలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24వ తేదిన నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ నామినేషన్ కార్యక్రమం ఉన్నందున భారీగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, ఎంపీటీసీలు చంద్రమోహన్‌నాయుడు, పగడం గోపాల్, సచివాలయ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు భూషిరెడ్డి, పులేంద్రనాయుడు, భాస్కర్‌రెడ్డి, అంబటి శివశంకర్‌రెడ్డి, మోక్షంరెడ్డి, నీలకంఠేశ్వరరెడ్డి, శేషన్న, రమణప్రసాద్, కురువ మల్లయ్య, కుమ్మరి కురుమన్న, సిలార్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కొత్తపల్లి: ఈనెల 24న నందికొట్కూరులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ నామినేషన్ కార్యక్రమం ఉంటుందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని శాప్‌ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని దుద్యాల గ్రామంలో ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపుకోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో అచ్చుగట్ల ముర్తుజావలి, కాంట్రాక్టర్ బాబుల ఆధ్వర్యంలో సుమారు 100 మంది వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. వీరికి శాప్‌ఛైర్మన్ కండువావేసి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

మండల కేంద్రంలో వడదెబ్బ తగిలి మృతి చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ కార్యకర్త షేక్ ఖాజా మియా(55) కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ ఛైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ నాగలక్ష్మీరెడ్డి, కో-ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, ఎంపీటీసీలు శివన్న, బాలరాజు, సర్పంచులు బాల ఎల్లయ్య, విజయ్‌కుమార్, కె.మారెన్న, మాజీ జెడ్పీటీసీ పురుషోత్తం రెడ్డి, మాజీ సింగల్ విండో ఛైర్మన్ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొలనుభారతిలో అక్షరాభ్యాసాలు



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కొలనుభారతి క్షేత్రంలో ఆదివారం అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా చారు గోషిని నదిలో ఉన్న నీటిని చల్లు కొని సరస్వతి అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు చేసుకున్నారు. అనంతరం చిన్నారులకు ఆలయ పురోహితులు శ్రీనివాస శర్మ, చక్రపాణి శర్మ ఆధ్వర్యంలో బీజాక్షరాలు దిద్దించారు.

తండ్రి డబ్బు ఇవ్వలేదని..

కొత్తపల్లి: తండ్రి డబ్బు ఇవ్వలేదని ఎర్రమఠం గ్రామ పంచాయతీ పరిధిలోని మజరా గ్రామమైన పాతమాడుగుల గూడెంకు చెందిన ఐలేని తిక్కస్వామి (25) శనివారం రాత్రి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తల్లి పెంటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు తెలిపారు.

బీజేపీ, జనసేనల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ, జనసేన నాయకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో బీజేపీ, జనసేన పార్టీలకు భారీ షాక్ తగిలింది. ఆదివారం శ్రీశైలంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో బీజేపీ, జనసేన పార్టీల నుంచి 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందిరికీ ఎమ్మెల్యే శిల్పా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. శ్రీశైలం కొత్తపేటకు చెందిన బీజేపీ నాయకురాలు ఎం.ఇంద్రజ ఆధ్వర్యంలో వీరు వైఎస్సార్‌సీపీలో చేరారు.

ఎమ్మెల్యే శిల్పా ప్రచారంపై అధికారుల ఓవరాక్షన్!

శ్రీశైలం టెంపుల్: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఆదివారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శ్రీశైలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. శ్రీశైల దేవస్థానానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అటంకాలు, ఇబ్బందులు కలిగించకుండా, దేవస్థాన పరిపాలన అధికారులకు అటంకాలు లేకుండా తన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రచార వాహనానికి శ్రీశైలం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వద్ద నుంచి చట్టపరంగా అనుమతి తీసుకున్నారు. అయితే కొంత మంది ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు ప్రచార వాహనంపై రాజకీయ నాయకుల ఫోటోలు ఉన్నాయని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల బృందం ఎమ్మెల్యే శిల్పా ప్రచారం నిర్వహిస్తున్న వాహనం వద్దకు చేరుకుని ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఎమ్మెల్యే అనుమతి తీసుకున్నామని చెబుతున్నప్పటికీ వినిపించుకోకుండా ఓ వరాక్షన్ చేశారు. అన్ని నిబంధనల మేరకే తాను ప్రచారం నిర్వహిస్తున్నాని చెప్పడంతో అధికారులు వెనుతిరిగారు.